వరద కాలువ పనులను పరిశీలించిన కార్పొరేటర్

చంపాపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ విలేజ్‌లోని వైఎస్సార్ విగ్రహం నుంచి భగత్‌సింగ్ యువజన సంఘం భవనం వరకు జీహెచ్ఎంసీ నిధులు రూ.1.50లక్షలతో చేపడుతున్న వరదనీటి కాలువ నిర్మాణ పనులు, అదే ప్రాంతంలో రూ.60లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్, టీపీఎస్ అర్చన, జీహెచ్ఎంసీ ఏఈ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

'వరద కాల్వల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న సమయంలో వరద కాల్వల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సూచించారు. వరద నీటి కాల్వల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈ హేమునాయక్‌కు సూచించారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీ సమీపంలోని వరద నీటి కాల్వను మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈ కనకయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శివారు ఆలయాలకు ప్రాధాన్యమివ్వాలి : కొప్పుల

మన్సూరాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): బోనాల పండుగకు శివారు ప్రాంతాల ఆలయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌ను మంగళవారం జోనల్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆలయాల వద్ద విద్యుత్, భద్రత, శుభ్రత ఇతర సదుపాయాల కల్పనకు తగిన నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టండి: పవన్‌కుమార్

కొత్తపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): అమ్మవార్ల ఆలయ పరిసరాల్లో రోడ్లకు మరమ్మతులు చేపట్టి బోనాల పండుగ ఏర్పాట్లకు సహకరించాలని జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జెడ్సీ హేమంత కేశవ్ పాటిల్‌కు కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన జెడ్సీని కలిసి బోనాల పండుగ వేళ కాలనీల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్యం, వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మూసీ పరిసరాల్లో దోమల నివారణ మందు పిచికారీ

కొత్తపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎంటమాలజీ విభాగం సిబ్బంది సోమవారం నుంచి శనివారం వరకు కొత్తపేట డివిజన్ పరిధిలోని సత్యానగర్ ప్రాంతం నుంచి న్యూనాగోల్ మూసీ వంతెన వరకు యాంటీ లార్వల్ ఆయిల్‌ను డ్రోన్‌తో పిచికారీ చేస్తారని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. మంగళవారం మూసీ తీరంలో డ్రోన్‌తో లార్వాల నివారణ మందు పిచికారీ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జోనల్ సీనియర్ ఎంటమాలజిస్టు మాధవరెడ్డి, ఎంటమాలజీ ఏఈ రాంబాబు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి: లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతను పాటించి అంటువ్యాధులను తరిమికొట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సౌభాగ్యనగర్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ కాలనీలో పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నందకిషోర్, ఆంజనేయులు, ఆదిశేషు, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులు చేపట్టాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం వనస్థలిపురం జైహింద్‌బాబు గల్లీలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ విగ్నేశ్వరీ, వర్క్ఇన్‌స్పెక్టర్ రమేష్, కాలనీవాసులు సంజయ్‌కుమార్, సాయికిరణ్‌గౌడ్, బీరం శ్రీధర్, స్వర్ణమాధవి, అంజన్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పని చేస్తున్నారా.. టైంపాస్ కోసం వస్తున్నారా ?

- బడంగ్‌పేట్ అధికారులపై ఎమ్మెల్యే సబిత ఆగ్రహం


సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): 'ప్రజా సమస్యలు పట్టించుకోరా.. అసలు మీరు పని చేస్తున్నారా.. లేక టైంపాస్ కోసం కార్యాలయానికి వస్తున్నారా?' అంటూ బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధికారుల పని తీరుపై మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ, మల్లాపూర్, మామిడిపల్లి గ్రామాల్లోని డివిజన్ల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, స్థానికంగా నెలకొన్న సమస్యలపై మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ పనితీరుతో పాటు ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, తదితర విభాగాల పనితీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చిన ఆమె.. వాటి పరిష్కారంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్పొరేషన్ పరిధిలో పెండింగులో ఉన్న అభివృద్ధి పనుల్లో జాప్యం తగదని, వాటిని సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి.సరస్వతి, డీఈఈ వెంకన్న, మేనేజర్ నాగేశ్వర్‌రావు, ఏఈ హరీశ్, టీపీవో కిరణ్‌కుమార్, ఏవో అరుణ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రాకేశ్, వినయ్, సంపత్, కల్యాణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న న్యూ అజయ్‌నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు

మన్సూరాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేస్తున్నామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నాగోల్ డివిజన్ న్యూఅజయ్‌నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, రోడ్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ న్యూఅజయ్‌నగర్‌లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు చిరంజీవి, కాలనీ అసోసియేషన్ సభ్యులు విఠల్‌రావు, సంపత్‌గుప్తా, వెంకటేశ్వర్, వాసుదేవరావు, బాలచంద్ర ఉన్నారు.

పేదల గుండెల్లో నిలిచిన రమేష్‌గౌడ్ సేవలు

- బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

ఎల్‌బీనగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ పురపాలక సంఘం మాజీ చైర్మన్ ఆకుల రమేష్‌గౌడ్ చేసిన సేవలు పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దివంగత ఆకుల రమేష్ గౌడ్ 66వ జయంతి వేడుకలను మంగళవారం ఎల్‌బీనగర్, బ్యాంకు కాలనీలలో ఘనంగా నిర్వహించారు. రమేష్‌గౌడ్ చిత్రపటాలకు బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకుడు ఆకుల అఖిల్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, మాజీ కౌన్సిలర్ అంజన్‌కుమార్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, రమేష్ యాదవ్, జాజుల ప్రవీణ్‌గౌడ్, కృష్ణారెడ్డి, రాములుగౌడ్, వీరస్వామి, ఆకుల శ్రీనివాస్, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నివాసాల మధ్య సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దు

- సామనగర్ కాలనీవాసులు

వనస్థలిపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ టవర్‌ను నివాసాల మధ్య ఏర్పాటు చేయొద్దని సామనగర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాలనీలో చేపడుతున్న సెల్‌టవర్ పనులను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ రేడియేషన్ వెదజల్లే సెల్‌టవర్‌ను కాలనీలో ఏర్పాటు చేస్తే ప్రజల ఆరోగ్యాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సామనగర్ కాలనీ అధ్యక్షుడు సామ బల్వంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ గుప్తా, కోశాధికారి ప్రవీణ్ కుమార్, జానయ్య గౌడ్, సతీష్ చారి, సిద్ధయ్య, ఇంద్రారెడ్డి, శ్రీనివాసరావు, రాంబాబు, శ్రీనివాస్ యాదవ్, రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

'బీసీల రిజర్వేషన్లలో ముస్లింలను చేర్చితే ఊరుకోం'

సరూర్‌నగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తమ పార్టీ స్వాగతిస్తున్నదని, కానీ, ఇందులో ముస్లింలను చేర్చితే ఊరుకోబోమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శంకర్‌రెడ్డి మాట్లాడుతూ 42శాతం రిజర్వేషన్లకు సంబంధించిన ఫైల్ రాష్ట్రపతి వద్ద పెండింగులో ఉండగా, రాష్ట్రంలో ఏ విధంగా దీనిని అమలు చేస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం చేసేది బీజేపీ ఒక్కటేనని ఆయన అన్నారు.

అవినీతిమయంగా బడంగ్‌పేట్ కార్పొరేషన్

బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ మొత్తం అవినీతిమయంగా మారిందని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని శంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తూ పోలీసు, రెవెన్యూ, మునిసిపల్ తదితర విభాగాల అధికారులను అజమాయిషీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం పీడీఎస్‌యూ పోస్టుకార్డుల ఉద్యమం

చాదర్‌ఘాట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పోస్టుకార్డుల ద్వారా నిరసన ఉద్యమాన్ని ప్రారంభించినట్లు అధ్యక్షుడు మందుల సైదులు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల బకాయిలను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఐడీయల్ జూనియర్, డిగ్రీ కళాశాల, ప్రగతి డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయానికి పోస్టు కార్డులను పంపించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ, తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్ డిపోల నుంచి ప్రత్యేక టూర్ ప్యాకేజీ

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని పుణ్య క్షేత్రాలతో పాటు విహార యాత్రల కోసం హయతనగర్-1, 2 డిపోల నుంచి ప్రతివారం టూర్ ప్యాకేజీలతో ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు డిపో మేనేజర్లు విజయ్, శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 19న రత్నగిరి, వర్గల్, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి పుణ్యక్షేత్రాలకు హయత్‌నగర్-1, 2 డిపోల నుంచి ఉదయం 6 గంటలకు ఎన్‌జీఓస్ కాలనీ నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని వారు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నం.9959226419, 9866022401, 9848782848లను సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

బోనాల పండుగకు మంత్రికి ఆహ్వానం

సైదాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ మాతామైదానంలోని శ్రీ విజయదుర్గమాత దేవాలయంలో ఆదివారం జరిగే బోనాల వేడుగకు హాజరుకావాలని కోరుతూ ఉత్సవ కమిటీ నేతలు మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సునీల్‌రెడ్డి, అల్లి శ్రవణ్, మధు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఐటీ సెల్ కోఆర్డినేటర్‌గా రవీందర్

సరూర్‌నగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఐటీ సెల్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ కోఆర్డినేటర్‌గా బడంగ్‌పేట్‌కు చెందిన చిన్నరావుల రవీందర్‌కుమార్ నియమితులయ్యారు. మంగళవారం తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్, కవాడిపల్లి, మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతిల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉల్లాస్ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక ప్రోత్సాహం అందించింది. మంగళవారం మండల పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభచూపిన 30 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున ట్రస్ట్ ప్రతినిధి మధుభాషిని మండల ఎంఈవో జగదీష్‌తో కలిసి చెక్కులను అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 56మందికి కౌన్సెలింగ్

కొత్తపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 56 మంది మద్యం ప్రియులకు వారి కుటుంబసభ్యుల సమక్షంలో మంగళవారం రాచకొండ పిల్లల ట్రాఫిక్ ట్రెయినింగ్ పార్కు లెక్చర్ హాల్‌లో ఇన్‌స్పెక్టర్ రాచపుడి, ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. టీటీఐ సిబ్బంది రమేష్ కౌన్సెలింగ్‌కు హాజరైన వారికి అవగాహన కోసం వీడియో క్లిప్పులు, పాటలూ ప్రదర్శించారు.

ఇష్టంలేని కళాశాలలో చేర్పించారని.. విద్యార్థిని ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఇష్టంలేని కళాశాలలో చేర్పించారని తీవ్ర మనస్తాపానికి గురైన విద్యార్థిని ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధి ఉమర్‌ఖాన్‌గూడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన కపింద్రా శ్యామల్ ఉపాధి కోసం కొన్నేళ్ల క్రితం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ఉమర్‌ఖాన్‌గూడకు వలసొచ్చారు. అతడి పెద్ద కుమార్తె శ్యామల్ ప్రియదర్శిని(18) పదోతరగతి పూర్తి కావడంతో తల్లిందడ్రులు స్థానికంగా ఉన్న కమలారాణి సంఘీ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం (బైపీసీ)లో చేర్పించారు. అయితే, ఆ కళాశాలలో చదివేందుకు ప్రియదర్శినికి ఇష్టం లేదు. దీంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో సీలింగ్‌ఫ్యాన్‌కు చున్నితో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అనంతరం ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులకు యువతి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే వారు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.